# ప్రజాశక్తి

సోమవారం 5 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# అయ్యన్న అలక..!

- చంద్రబాబు తీరుపై అసంతృప్తి
- రా కదలిరా ఏర్పాట్లకు దూరం
- అదే దారిలో అనిత
- నేడు గొండుపాలెంలో సభకు టిడిపి అధినేత రాక

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కె.కోటపాడు విలేకరి**

టిడిపి సీనియర్ నాయకుడు, ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మధ్య దూరం పెరుగుతున్నట్లు కనబడుతోంది. వచ్చే ఎన్నికల్లో సీట్లు కేటాయింపు విషయమై అయ్యన్న సూచనలను చంద్రబాబు పరిగణనలోకి తీసుకోకపోవడంతో మనస్తాపానికి గురైన అయ్యన్న సోమవారం కోటపాడు మండలంలో జరగనున్న రా కదలిరా కార్యక్రమ ఏర్పాట్లకు దూరంగా వున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రా..కదలిరా కార్యక్రమం ఏర్పాట్లను అయ్యన్న, ఆయన తనయుడు విజయ్ చూడ్డానికి వెళ్లకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. నిన్న మొన్నటి వరకూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పార్టీ కార్యక్రమాలను దగ్గరుండి విజయవంతం చేసిన అయ్యన్న ఈసారి రా కదలిరా ఏర్పాట్లు పరిశీలనకు వెళ్లకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. వ్యక్తిగత పనుల కారణంగా బయటకు వెళ్లడంతో ఆయన రాలేకపోయినట్లు పార్టీ నాయకులు చెబుతున్నా కేడర్ నమ్మడం లేదు. అనకాపల్లి ఎంపీ టిక్కెట్, నర్సీపట్నం ఎమ్మెల్యే టిక్కెట్‌పై అయ్యన్న చేసిన ప్రతిపాదనలను చంద్రబాబు తిరస్కరించడంతో ఇద్దరి మధ్య జరిగిన చర్చల్లో కొంతసేపు వాదోపవాదాలు జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ తన తనయుడు విజయ్‌కు కేటాయించాలని అయ్యన్న కోరగా బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తికి ఎంపీ టిక్కెట్ మిగతా 2లో..

తహశీల్దార్ హత్య కేసు

# నిందితుని వేటలో పోలీస్ బృందాలు

**ప్రజాశక్తి - మధురవాడ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన తహశీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితున్ని పట్టుకునేందుకు పోలీసు బృందాలు చురుగ్గా కదులుతున్నాయి. అతి త్వరలోనే నిందితున్ని పట్టుకుంటామని పోలీసాధికారులు చెబుతున్నారు. హత్య వెనుక ల్యాండ్ మాఫియా హస్తముందని, స్థల, ఫ్లాట్ల విషయంలో తమకు అనుకూలంగా వ్యవరించనందున నిందితుడు హత్యకు పాల్పడ్డాడని ఇలా పలు కథనాలు వినిపిస్తున్నప్పటికి నిందితున్ని పట్టుకుని నిజానిజాలు బయటపెడతాయని అంటు న్నారు. అంతవరకూ వేచి ఉండా ల్సిందేనని చెబుతున్నారు.

**ఇంకా క్లారిటీ రాలేదు : ఆర్‌డిఒ భాస్కరరెడ్డి**

**గ్రేటర్ విశాఖ బ్యూరో :** తహశీల్దార్ హత్య ఘటనపై ఇంకా స్పష్టత రాలేదని, పోలీస్ విచారణ జరుగుతోందని భీమునిపట్నం ఆర్‌డిఒ భాస్కరరెడ్డి 'ప్రజాశక్తి'కి ఆదివారం రాత్రి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఎలతో ఆదివారం సమావేశంలో పాల్గొన్నామని, ఈ అంశం చర్చకు రాలేదని అన్నారు. ప్రభుత్వ ఒన్ సెంట్ భూమి రిజిస్ట్రేషన్‌పై తామంతా కూర్చొన్నామని తెలిపారు. కార్యాలయంలో ఎన్ని పెండింగ్ ఫైల్స్ ఉన్నాయో దిగువ శ్రేణి రెవెన్యూ సిబ్బందితో చర్చించాలని కలెక్టర్ ఆదేశించిన తర్వాత ఆర్‌డిఒ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# సిపిఎస్‌పై ఉద్యోగుల నిరసన

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** సిపిఎస్ సమస్యను తక్షణం పరిష్కరించాలని, లేకుంటే పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వారు నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగులకు వెన్నుపోటు పొడిచిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే మిగతా 2లో..

# ఎన్నికల్లో ఏ బాధ్యతనైనా స్వీకరిస్తా

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధినేత అప్పగించే ఏ బాధ్యతనైనా స్వీకరిస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సర్క్యూట్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య జరిగిన పారిశ్రామిక అభివృద్ధికి, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధికి చాలా తేడా ఉందని, దీనిపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న మిగతా 2లో..

## పంచ గ్రామాల భూ సమస్యపై ర్యాలీ

▶ వార్త మెయిన్‌లో..

## ఊరించి.. ఉసూరుమనిపించి..

▶ వార్త 2లో..

వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ చివరి పేజీల్లో..

సెంచరీతో ఆకట్టుకున్న గిల్

# సందడే.. సందడి

మజానిస్తున్న భారత్ - ఇంగ్లండ్ టెస్టు

గిల్ సెంచరీ - పోటెత్తిన విద్యార్థులు

## మొదటి పేజీ తరువాయి..

### అయ్యన్న అలక..!

ఇవ్వనున్నట్లు చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది.

తన తనయుడు విజయ్‌కు ఇవ్వకపోయినా.. జిల్లాలో పార్టీ జెండాను మోసిన ఎవరికిచ్చినా పరవాలేదని అయ్యన్న అన్నట్లు తెలిసింది. పార్టీతో సంబంధంలేని దిలీప్ చక్రవర్తికి టిక్కెట్ ఇవ్వాలనుకోవడం సరికాదంటూ అయ్యన్న విబేధించినా, ఈ విషయంలో మార్పులేదని చంద్రబాబు అన్నట్లు తెలిసింది. అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వకపోయినా, నర్సీపట్నం ఎమ్మెల్యే టిక్కెట్ తనకు బదులు విజయ్‌కు ఇవ్వాలని చెప్పినా అందుకు అంగీకరించని చంద్రబాబు... ఈ ఎన్నికల్లో మీరే పోటీ చేయాలని చెప్పడంతో కలతచెందిన అయ్యన్న వెనుదిరిగి వచ్చినట్లు తెలిసింది. దిలీప్ చక్రవర్తికి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలనుకోవడం, నర్సీపట్నం టిక్కెట్ విజయ్‌కు ఇవ్వనని చెప్పడం అయ్యన్నను మనస్తాపానికి గురిజేసింది. జిల్లాలో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఖర్చులు దిలీప్ చక్రవర్తి పెట్టినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. పార్టీ కార్యక్రమాలకు పెట్టుబడి పెడుతున్న చక్రవర్తికి అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలన్న ఆలోచనకు చంద్రబాబు పాదయాత్రకు ముందే వచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఎంపీ టిక్కెట్ దిలీప్ చక్రవర్తికి ఇవ్వాలన్న చంద్రబాబు నిర్ణయంపై అయ్యన్న అభ్యంతరం చెబుతూ వస్తున్నారు. యువగళం పాదయాత్రలో దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలపై అప్పట్లోనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విషయం లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు వైఖరిలో మార్పులేకపోవడంతో వి.మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం గొండుపాలెంలో 'రా కదలిరా' బహిరంగ సభ వేదిక ఏర్పాట్లకు అయ్యన్న దూరంగా వున్నారు. జిల్లాకు చెందిన మరో పొలిట్ బ్యూరో సభ్యులు అనిత కూడా చంద్రబాబు నిర్ణయాలపై అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. అందుకనే అయ్యన్న దారిలో అనిత కూడా పయనిస్తూ.. రా కదలిరా కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలనకు వెళ్లలేదని తెలిసింది. ఈ పరిణామాలు ఆ పార్టీలో పెరుగుతున్న అంతర్గత సమస్యలకు అద్దంపడుతున్నాయి.

నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

### సిపిఎస్‌పై ఉద్యోగుల నిరసన

ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులందరికీ అవిశ్వాస పాత్రునిగా సిఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరిదాస్, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు గూమారు శ్రీనివాస్, బండారు దేవుడుబాబు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో ఏ బాధ్యతనైనా స్వీకరిస్తా

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎల్లో మీడియాకు, ప్రతిపక్షాలకు తప్ప ప్రజలకు సవివరంగా తెలుస్తున్నాయని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డితోనే తన భవిష్యత్తు అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న అంశంపై స్పష్టత రాలేదంటూ జరుగుతున్న ప్రచారంపై మంత్రి అమర్‌నాథ్ వివరణ ఇచ్చారు. తన రాజకీయ భవిష్యత్తుపై గతంలో ఏం చెప్పానో, ఇప్పుడు అదే మాట్లాడుతున్నానని అన్నారు. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో జగన్మోహన్ రెడ్డి అర్జునుడు అయితే ఆయన సైన్యంలో తాను ఒక సైనికుడిగా పని చేస్తానని అన్నారు.

### ఎంవి స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఎంవిపి. కాలనీ :** నగరంలోని ఎంవిపి.కాలనీ సెక్టార్-11లో ఆదివారం ఎంవి స్పెషాలిటీ క్లినిక్స్‌ను ప్రముఖ విద్యావేత్త, గాయత్రి సంస్థల సెక్రటరీ డాక్టర్ పి.సోమరాజు ప్రారంభించారు. ఈ క్లినిక్ ద్వారా డాక్టర్లు సూర్యతేజ వెన్నెలకంటి, అశ్విని మాచిరాజు సేవలు అందించనున్నారు. డాక్టర్ సూర్యతేజ సిఎంసి వెల్లూరు నుంచి వయోవృద్ధుల ప్రత్యేక చికిత్స (జీరియాట్రిక్)లో శిక్షణ పొంది విశాఖపట్నంలో జీరియాట్రిక్ క్లినిక్ సేవల వైద్య నిపుణులుగా సేవలు అందిస్తున్నారు. డాక్టర్ అశ్విని ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుంచి ఎండోక్రైనాలజీలో పట్టభద్రులు అయ్యారు. రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజిషన్స్, యూకే నుండి స్పెషాలిటీ సర్టిఫికేట్ ఇన్ ఎండోక్రైనాలజీ అండ్ డయాబెటీస్ పట్టాను కూడా పొందారు. పిల్లలు, పెద్దలలో వచ్చే హార్మోన్ సంబంధిత (డయాబెటీస్, ఊబకాయం, థైరాయిడ్, పిసిఓఎస్, పిట్యూటరీ (గ్రంథి) సమస్యల వైద్య నిపుణులుగా ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నారు. ఎంవి స్పెషాలిటీ క్లినిక్స్ ద్వారా ఫార్మసీ, లేబొరేటరీ, ఫిజియోథెరపీ, రిహాబ్, డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా చెప్పులు తయారీ, హోమ్ విజిట్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ క్లినిక్స్ ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు వైద్య నిపుణులు, వ్యాపారవేత్తలు డాక్టర్ సూర్యతేజ, డాక్టర్ అశ్వినిలకు అభినందనలు తెలిపారు.

క్లినిక్ ప్రారంభ వేడుకలో అతిథులు

# పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగాల కల్పన

**కొత్త కంపెనీలకు ప్రభుత్వ ప్రోత్సాహం**
**- అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్**

**ప్రజాశక్తి - అనకాపల్లి**

పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే క్రమంలో తీసుకుంటున్న చర్యలను, ప్రస్తుతం జిల్లాలోని పరిస్థితిని ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి ?**

అనకాపల్లి జిల్లాలో 124 పరిశ్రమలు ఉన్నాయి. ప్రధానంగా ఫార్మాసూటికల్స్, మందుల కంపెనీలు, ఐరన్, సిమెంట్ తదితర కంపెనీలు ఉన్నాయి. సుమారు లక్షా 72 వేల మంది ఆయా పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు.

**మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ గురించి వివరిస్తారా ?**

జిల్లాలో ఎంఎస్ఎంఇ యూనిట్లు సుమారు 11122 ఉన్నాయి. వీటి ద్వారా 77 వేలా 721 మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

**ఎంఎస్‌సిసిడిపి పథకంలో భాగంగా సిఎఫ్‌సి క్లస్టర్‌లో ఎటువంటి పరిశ్రమలకు అవకాశం కల్పిస్తున్నారు ? గ్లోబల్ సమ్మిట్ ప్రతిపాదనల మాటేంటి ?**

రైస్‌మిల్స్, జీడిపిక్కల పరిశ్రమ, కాయిర్ పరిశ్రమలకు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. గ్లోబల్ సమ్మిట్‌లో వచ్చిన పరిశ్రమల నుంచి సుమారు 30 వరకూ ప్రతిపాదనలు వచ్చాయి.

**జిఒ ప్రకారం 75 శాతం ఉద్యోగ అవకాశాలను స్థానికులకు ఇస్తున్నారా ?**

పరిశ్రమల్లో పనిచేసేందుకు స్థానికులకు తగిన శిక్షణ ఇవ్వాల్సి ఉంది. జిఒ ఉన్నా తగినంతగా అమలుకు నోచుకోవడంలేదు.

# ఊరించి.. ఉసూరుమనిపించి..

**ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 105 - ఎస్‌జిటి కేవలం 8 పోస్టులే - నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ**

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా కేవలం 105 పోస్టులను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేయనుంది. అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనుండడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో అన్ని పోస్టులు కలిపి 105 ఖాళీలు వున్నట్లు విద్యాశాఖ తేల్చింది. ఆ లెక్కల ప్రకారం.. కొన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఖాళీ పోస్టులే లేవు. జెడ్‌పిపి, ఎంపిపి యాజమాన్యం పాఠశాలల్లో తెలుగు, ఫిజికల్ సైన్సు, సోషల్, ఎస్‌జిటి ఖాళీలు లేవు. ప్రభుత్వ యాజమాన్యంలో తెలుగు, లెక్కలు, బయోలాజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టు టీచర్ల ఖాళీలు చూపలేదు. జివిఎంసి, మున్సిపాల్టీల్లో లెక్కలు, ఎస్‌జిటి పోస్టులు లేవు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

**యాజమాన్యాల వారీగా ఖాళీగా వున్న పోస్టులు**

| యాజమాన్యం | తెలుగు | హిందీ | ఇంగ్లీష్ | లెక్కలు | పిఎస్ | బిఎస్ | సోషల్ | పిఇటి | ఎస్‌జిటి | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| జెడ్‌పిపి, ఎంపిపి | - | 23 | 3 | 4 | - | 5 | - | 28 | - | 63 |
| ప్రభుత్వ | - | 1 | 3 | - | 4 | - | - | 9 | 8 | 25 |
| జివిఎంసి, మున్సిపల్ | 7 | 3 | 3 | 1 | - | 1 | 1 | 1 | - | 17 |
| మొత్తం | 7 | 27 | 9 | 5 | 4 | 6 | 1 | 38 | 8 | 105 |

దగ్ధమైన దుకాణం ఇదే..

### ప్రభుత్వ మద్యం దుకాణం దగ్ధం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గం పరిధిలోని సూర్యాబాగ్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం దగ్ధమైంది. సూర్యాబాగ్ అగ్నిమాపక దళ సిబ్బంది సమాచారం మేరకు ఈ ప్రమాదం శనివారం అర్ధరాత్రి జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణంలో మంటలు లేచి, పొగలు రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటాన అగ్నిమాపకదళ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణం మొత్తం దగ్ధమైంది. దుకాణంలో 2000 వరకు బీరు, మద్యం బాటిల్స్ ఉన్నాయి. అవి పూర్తిగా దగ్ధం కాగా సుమారు రూ.40 లక్షల నష్టం వాటిల్లింది. లాకర్ కౌంటర్‌లోని రూ.3 లక్షలా 50 వేల నగదు కూడా మంటలకు ఆహుతైంది. అలాగే మద్యం షాపు ఉన్న భవనానికి కూడా నష్టం కలిగింది. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బందపల్లిలో 'పరివర్తన'

**ప్రజాశక్తి -రంపచోడవరం :** ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐలు ఎం.మోహన్‌కుమార్, సత్యసాయి ఆధ్వర్యంలో ఆదివారం బందపల్లి గ్రామంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాబోవు ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా ఎలా మసలుకోవాలలో ప్రజలకు అవగాహన కల్పించారు.

IN THE HONOURABLE COURT OF THE 4TH ADDITIONAL DISTRICT JUDGE CUM SC&ST COURT AT SRIKAKULAM
AS No 49/2018

BETWEEN:
KASPA MALLESWARA RAO ...APPELLANT
AND
KASPA VENKATA RAMANA (died )&18 others ...RESPONDENTS

NOTICE TO RESPONDANT NO:17
KASPA AURNKUMARI, W/o Basuri Kali Naveenkumar age 32 years, Advocate Railway Colony, Gopalapatnam, Visakhapatnam

NOTICE
పై నెంబర్ అప్పీల్ లో మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి cum SC & ST కోర్టు శ్రీకాకుళం వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు అప్పీల్ లో మీకు ఎటువంటి అభ్యంతరములు వున్నా స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారాగా గాని తేది 19.02.2024 న ఉదయం గం.10.30 ని. పై కోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల అక్షేపణలు తెలియపరచుకోవలెను లేనియడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

N. విజయకుమార్
V.S. శ్రీనివాసరావు
అడ్వకేట్స్, శ్రీకాకుళం.

IN THE HONOURABLE COURT OF CHIEF METROPOLITAN MAGISTRATE AT VISAKHAPATNAM
C.C. 6154 / 2022

Between
Kasi Murali Krishna . . . Complainant
And:
Kasireddy Devi Kiran . . . Accused

NOTICE
To: Kasireddy Devi Kiran
S/o. Satyarao,
aged 38 yrs,
O/o. D.No. 49-24-25/A/4,
2nd Floor, Suriplaza,
Sankaramatam Road,
Visakhapatnam.

Please take notice that the above named complainant filed case against you in CC 6154/2022 and the matter stands posted to 15-2-2024. On that day you have to attend personally or through an advocate attend before the Hon'ble Court at 10-30 A.M. failing which the matter will be decided exparte in your absence.

(By Order of the Hon'ble Court)
M.SUNEEL
Advocate,
Visakhapatnam
Cell : 9948717111

# పలుచోట్ల క్రికెట్ టోర్నమెంట్‌లు ప్రారంభం

బంటుపల్లి పంచాయతీలో పోటీలను ప్రారంభిస్తున్న సిఐ తిరుపతిరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

**జిల్లాలో పలుచోట్ల క్రికెట్ టోర్నమెంట్‌లను ఆదివారం ప్రారంభించారు.**

**ఆనందపురం :** ఆనందపురం మండలం బంటుపల్లి వారి పంచాయతీలో ఆదివారం కీర్తిశేషులు పిన్నింటి రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సిఐ టివి.తిరుపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పిన్నింటి రాజు చిన్న వయసులోనే ప్రమాదంలో మృతిచెందడం బాధాకరమని, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆయన పేరు మీద క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం సంతోషమన్నారు. మాజీ సర్పంచ్ లోడగల రమణ మట్లాడుతూ, రాజు జ్ఞాపకార్థం యువకులు క్రికెట్ పోటీలు ని ం ్ వ ి ా ం చ ్ డ ం అభినందనీయమన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో 60 టీములు పాల్గొంటాయని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలును విజేత టీమ్‌లకు అందిస్తారని పేర్కొన్నారు. పోటీలను ఏర్పాటుచేసిన ఎల్‌వి.పాలెం యూత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు కోన శ్రీను, లారీ యూనియన్ అధ్యక్షులు గండేటి సూర్యనారాయణ, బమ్మిడి తారక్, లోడగల సురేష్, దేవర తాతారావు, రాజు తల్లి పాపయ్యమ్మ, ఆకుల సురేష్, లోడగలవానిపాలెం యూత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

**పెందుర్తి :** మండలం దువ్వపాలెం గ్రామంలో ఈనెల 20న మార్లమాంబ పండగ మహోత్సవ పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జనసేన నాయకుడు కంచుపాటి విశ్వనాథ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, క్రీడలు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. టిడిపి -జనసేన పొత్తుతో అధికారంలోకి రాగానే ఈ ప్రాంతాన్ని క్రీడా హబ్‌గా తయారుచేస్తామని తెలిపారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, పండగల వల్ల మనలో ఐక్యత పెరుగుతుందన్నారు.

కొంత సమయం తర్వాత జనసేన పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జి పంచకర్ల రమేష్‌బాబు వచ్చి క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆటను ప్రారంభించారు.

దువ్వపాలెంలో పోటీలను ప్రారంభిస్తున్న శివశంకర్

## ముగిసిన రగ్బీ పోటీలు

బాలుర విభాగంలో విజేతగా నిలిచిన కర్నూలు జిల్లా జట్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధి మినీ క్రికెట్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరిగిన 9వ ఎపి రాష్ట్ర అంతర్ జిల్లా రగ్బీ ఛాంపియన్ షిప్ -2024 పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా బాలికలు, బాలుర జట్లు విజేతగా నిలిచాయి.

**విజేతలు**

బాలికల విభాగంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ప్రకాశం, మూడో స్థానంలో అనంతపురం, నాలుగో స్థానంలో గుంటూరు జిల్లా జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో కర్నూలు మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో నెల్లూరు, మూడో స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు విశాఖ జోన్ -1 ట్రాఫిక్ ఎసిపి ఎం.జాన్ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. సన్ స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు రగ్బీ ఛాంపియన్ షిప్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. పోటీలకు పర్యవేక్షకులుగా నోయెల్ మాథ్యూ శ్యామ్ హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు ఎన్.లలిత్‌కుమార్, కార్యదర్శి సి హెచ్.కిషోర్‌కుమార్, కోశాధికారి పి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## 5వ వార్డులో జనసేన పాదయాత్ర

**ప్రజాశక్తి -మధురవాడ :** భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం జివిఎంసి 5వ వార్డు పరిధి అయ్యప్పనగర్, గణేష్‌నగర్, బొట్టవాణిపాలెం, శివశక్తినగర్, వైఎస్ఆర్.కాలనీల మీదుగా బోరవాణిపాలెం వరకు సాగింది. రాత్రికి బోరవాణిపాలెంలో బస చేశారు. ఈ సందర్భంగా పంచకర్ల సందీప్ మాట్లాడుతూ, 5వ వార్డులో అనేక సమస్యలున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా రాజీవ్ గృహకల్ప కాలనీలో భూగర్భ డ్రెయినేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసిపి వైఫల్యాలను, జనసేన-టిడిపి మైత్రి అవసరాన్ని వివరిస్తున్నారు. యువత పార్టీలోకి అధికంగా వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ, జిల్లా నాయకులు బివి.కృష్ణయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల గణేష్, దారపు సూరిబాబు, కె.ఈశ్వరరావు, ధర్మారావు, ప్రశాంత్, ఈమంది శ్రీను, కాకి ప్రకాష్, గోలి సతీష్ పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి -సీతమ్మధార :** పోలవరం పూర్తి చేయడంలో, విశాఖకు రైల్వే జోన్ తీసుకురావడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త నాగలక్ష్మి ఆరోపించారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ వస్తే వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి మొదటి మెట్టు అవుతుందన్నారు. రైల్వే జోన్ వస్తే ఉత్తరాంధ్రలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. వైసిపికి 31 మంది ఎంపీలున్నా ఏమీ చేయలేక చేతులు ముడుచుకు కూర్చున్నారన్నారు. రైల్వే జోన్ కార్యాలయం కోసం 53 ఎకరాల స్థలం అడిగితే ఇవ్వలేదని రైల్వే మంత్రి స్వయంగా చెప్పారని, దీనికి ఏమంటారని నిలదీశారు. రుషికొండలో ప్యాలస్‌కు, ప్రతి జిల్లాలో వైసిపి కార్యాలయాలు కట్టుకోవడానికి స్థలాలు ఉంటాయికానీ రైల్వే జోన్ కోసం స్థలం లేదా అని ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్లినప్పుడు తమ్ముడు అవినాష్ బెయిల్ కోసం కాకుండా రైల్వే జోన్, స్పెషల్ స్టేటస్ కోసం కనీసం ఒక్క సారైనా అడగావా అంటూ జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. అప్పులు తేవడం, ప్రభుత్వ ఆస్తులు అమ్మడం తప్ప జగన్మోహన్‌రెడ్డికి ఏమి తెలుసన్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్తలు కిరణ్ ప్రసాద్, త్రివేణి, రూపదేవి పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించిన ఎన్నికల కమిషనర్

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాద్రి అప్పన్నను ఆదివారం ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా అండర్ సెక్రెటరీ సంజయ్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారికి ఈవో స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని శేష వస్త్రాన్ని అందించారు.

## హిందీ పుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన హిందీ విద్యార్థులకు దాతల సహకారంతో ఆదివారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో హిందీ పుస్తకాలు పంపిణీ చేశారు. 9 రకాల హిందీ పరీక్షలకు ఉపయోగపడే సంబంధిత పుస్తకాలను ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, వ్యవస్థాపక అధ్యక్షులు కెవెన్ఆర్.కృష్ణారావు విద్యార్థులకు అందజేశారు.

టెన్నిస్ కోర్టు ప్రారంభంలో విద్యార్థులు

## టెన్నిస్ కోర్టు ప్రారంభం

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడలో బ్లూమెర్ను విల్లాస్ సంస్థ ఏర్పాటుచేసిన టెన్నిస్ కోర్టును వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆదివారం ప్రారంభించారు. నేటి యాంత్రిక జీవితంలో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం టెన్నిస్ ఆట ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ క్రీడాకారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ బీమా అందజేత

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి నాలుగో వార్డు కె.నగరపాలెం -2 సచివాలయం పరిధిలో గొల్లల తిమ్మాపురం గ్రామానికి చెందిన అప్పయ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా తక్షణ సాయంగా మృతురాలు కుమార్తెకు రూ.10 వేలును వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పైడితల్లమ్మ పరస

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాద్రి అప్పన్న సోదరి అడవివరం గ్రామ దేవత పైడితల్లమ్మ పరస మహోత్సవాన్ని దేవస్థానం అధికారులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ట్రస్టు బోర్డు సభ్యులు గంటల శ్రీనుబాబు దంపతులు వస్త్రాలను సమర్పించారు. ఈ ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. దర్శన అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

## నేరాలు ఘోరాలు

### బంగారం బిస్కెట్లు పట్టివేత

**ప్రజాశక్తి- ఆనందపురం :** బంగారం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధి భీమిలి క్రాస్ రోడ్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీరిని మహారాష్ట్రకు చెందిన దీపక్ విటల్ (24), అక్షయ్ అప్‌షో సవత్ (20)గా గుర్తించారు. వారి నుంచి 815 గ్రాముల బరువు కలిగిన 7 బంగారు బిస్కెట్లు, రూ.2 వేలు నగదు, ఒక బ్రాస్లెట్, 2 సెల్ ఫోన్లు స్వాధీనపరచుకున్నారు. వారిని ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తిరుపతిరావు తెలిపారు.

### యువకుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి - ఆరిలోవ :** మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పార్వతీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఆరిలోవ పార్వతీనగర్‌లో రెడ్డి తౌడు తన భార్య ముత్యాలమ్మ, కుమారుడు ప్రదీప్, కుమార్తె సౌమ్యలతో నివాసం ఉంటున్నారు. కుమారుడు ప్రదీప్ (17) మద్దిలపాలెం కృష్ణా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో తల్లిదండ్రులు ఉండగానే ప్రదీప్ గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో కిందకు దించి విమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ప్రేమించిన యువతి తిరస్కరించిందని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసినట్లు సమాచారం.

### న్యాయంపూడిలో చోరీ

**ప్రజాశక్తి-నక్కపల్లి:** మండలంలోని న్యాయంపూడిలో గ్రామానికి చెందిన గోరింట వరలక్ష్మికి చెందిన బంగారం, నగదు దొంగలు అపహరించారు. వరలక్ష్మి శనివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటిలో బీరువాలో ఉన్న బట్టలు సామాగ్రి చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దీంతో, అనుమానం వచ్చి పరిశీలించగా బంగారం, వెండి చోరీకి గురైంది. కిటికీలోంచి దొంగ చొరబడి అపహరించాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా సిఐ విజయ్ కుమార్ పరిశీలించారు.క్లూస్ టీం పరిశీలన చేశారు.

### కోడి పందేల శిబిరంపై దాడి

**ప్రజాశక్తి-యస్.రాయవరం:** మండలంలో కోడి పందాలు ఆడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఎ.విభీషణరావు తెలిపారు. ఆదివారం అడ్డురోడ్డు తిమ్మాపురం గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### 33 కిలోల లిక్విడ్ గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** మండల కేంద్రంలో ఆదివారం స్థానిక పోలీసులు మూడు రోడ్ల జంక్షన్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 33 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సీఐ రమేష్, ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.పోలీసుల కథనం మేరకు... కూడలిలో జీపు, కారును ఆపి తనిఖీలు చేయగా సౌండ్ బాక్సులలో రహస్యంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కారు, జీపులో ఉన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వీరిలో ఇద్దరు కేరళ రాష్ట్రానికి చెందిన వారు కాగా మరో ఇద్దరు అనకాపల్లి జిల్లా వడ్డాది గ్రామానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరి వద్ద నుండి ఐదు మొబైల్ ఫోన్లను, రూ.12,500 నగదును స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## నాలుగు సిమెంట్ బెంచీలు వితరణ

**ప్రజాశక్తి -తగరపువలస :** భీమిలి మండలం టి.నగరపాలెంలోని కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మండలంలోని సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ తన సొంత నిధులు రూ.15 వేలతో 4 సిమెంట్ బెంచీలను ఆదివారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూసర్ల రామారావు, కోరాడ సూరిబాబు, పల్లా పోతురాజు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

## రజక సంక్షేమ సంఘం కేలండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి -గాజువాక :** విశాఖ జిల్లా రజక సంక్షేమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, తోకాడ రాము, రజక సంఘం గాజువాక నియోజకవర్గ గౌరవాధ్యక్షులు పిడిమి రమణ, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వైసిపి నాయకులు పరదేశి, ధర్మాల శ్రీను, భూపతిరాజు శ్రీనివాసరాజు, రజక సంఘం నాయకులు వాండ్రాసి సన్యాసిరావు, కోడమంచిలి కామేశ్వరరావు, పట్నాల ప్రసాద్, వాండ్రసి మురళీరాజు, కప్పిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎవికె పాఠశాలలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సిఐ తదితరులు

## ఎవికె పాఠశాలలో ఎగ్జిబిషన్

**ప్రజాశక్తి- ములగాడ :** పారిశ్రామిక ప్రాంతంలోని ఎవికె పాఠశాలలో నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో తమ నైపుణ్యాలను జోడించి ప్రదర్శనలిచ్చారు. ప్రతి అంశంలోనూ పరిశీలన, పరిశోధన, విషయ పరిజ్ఞానం ఉండేలా చూశారు. ప్రాచీన కవులు, సాహిత్యం, నాటక రూపాలను కూడా ప్రదర్శించారు. దేశ భక్తులు, అమరవీరుల ముఖచిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు హాజరై ప్రదర్శనలను తిలకించారు. వాటి పనితీరును విద్యార్థులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ పి.మానసత్రినాథ్, వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, సంధ్యారాణి,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కిశోర్‌కుమార్ తదితరులు

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి -ములగాడ :** జివిఎంసి 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీ, ఎకెసి కాలనీలలో రూ.76 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డు పరిధిలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలి ఉన్న పనులను కూడా దశలవారీగా చేపడతామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, షిప్‌యార్డు అధికారులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## హుదూద్ కాలనీ పెద్దలతో ఆత్మీయ కలయిక

**ప్రజాశక్తి ములగాడ** : జివిఎంసి 62వ వార్డు ఎన్‌టిఆర్ హుదూద్ కాలనీ గ్రామ కమిటీ పెద్దలు, ముఖ్య నాయకులతో పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, వైసిపి అధ్యక్షుడు బిశెట్టి గణేష్‌కుమార్ ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగాఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలవచ్చని తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 1088వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎఐటియుసికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ, ఎన్.రామారావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యూహాత్మకంగా చేస్తోందన్నారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ప్రజాసంఘాలు, కార్మికులు, రాజకీయ నాయకులు పూనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ వెంకటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మంత్రి రవి, నందకి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

# నేటి నుంచి పెన్షనర్ల నిరసనలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ములగాడ :** సమస్యలపై ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎన్ఎడి (మర్రిపాలెం) సమీపంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిరసనలు చేపట్టబోతున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరసనలో విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమలు, సెంట్రల్ అండ్ స్టేట్ పెన్షనర్స్ పాల్గొని కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టాలన్నారు. కనీస పెన్షన్ రూ.9 వేలతో పాటు దానికి డిఎ అనుసంధానం చేయాలని, భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని, అందరికీ హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలని, రైల్వే రాయితీని పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఐదేళ్ల నుంచి పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో తమ పోరాటాన్ని ఉధృతం చేసినట్లు తెలిపారు.

**మాధవధార :** విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కమిటీల ఆధ్వర్యాన ఐదు రోజులు చేపట్టే రిలే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి ఎస్ సుధాకరరావు కోరారు. 5వ తేదీన షిప్ యార్డు పెన్షనర్లు, 6న జింక్ స్మెల్టర్ పెన్షనర్లు, 7న భెల్, 8న స్టీల్‌ప్లాంట్, 9వ తేదీన జ్యూట్ మిల్లు, ఆర్‌టిసి, ఆర్ఇసిఎస్, డిసిసి పెన్షనర్లు దీక్షలో కూర్చుంటారని తెలిపారు.

## బిజెపిని ఓడించాలి

**ప్రజాశక్తి-సీతమ్మధార :** రాజ్యాంగానికి వ్యతిరేకంగా మనువాదాన్ని అమలుచేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ-అంబేద్కర్) ప్రధాన కార్యదర్శి మోహన్‌లాల్ పాటిల్ పిలుపునిచ్చారు. నగరంలోని బుల్లయ్య కాలేజీ దరి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆర్‌పిఐ (అంబేద్కర్) ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బుద్ధుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మోహన్‌లాల్ పాటిల్ మాట్లాడుతూ, బిజెపి కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి పాలన సాగిస్తోందని విమర్శించారు. బిజెపిని ఓడించడానికి కలిసివచ్చే అన్ని పార్టీలతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిలు బిజెపికి అనుకూలంగా ఉంటే వాటిని వ్యతిరేకిస్తామని తెలిపారు. మార్పు కోసం, సామాజిక అసమానతలు తొలగింపు కోసం అంబేద్కర్ స్థాపించిన పార్టీ ఆర్‌పిఐ అని, రాజ్యాధికారం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఉత్సాహవంతులైన వారు పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాతీయ ఉపాధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు మాట్లాడుతూ మెజారిటీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆధిపత్య కులాలు పాలించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. దళిత, బహుజనులు పాలకులుగా మారిన నాడే నిజమైన మార్పు సాధ్యమని అంబేద్కర్ మార్గ నిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ పిడి.సత్యపాల్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, జెవి.ప్రభాకర్, గార సత్యనారాయణ, ఆర్‌పిఐ నాయకులు అంజయ్య, డేవిడ్ రాజ్, పిట్ట వరప్రసాద్, గౌతం బాబు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి -గాజువాక :** జోగవాణిపాలెంలోని స్వామి విద్యానికేతన్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై విసిసి ఆధ్వర్యాన ఆదివారం అవగాహన కల్పించారు. సుమారు 6 గంటల పాటు వివిధ సబ్జెక్టులపై ఆయా సబ్జెక్టు నిపుణులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పదో తరగతి మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ పాలూరు లక్ష్మణస్వామి, బెహరా విద్యాసంస్థల ప్రతినిధి డాక్టర్ చైతన్య, అగనంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ బయాలజీ టీచర్ కృష్ణవేణి, ఫిజిక్స్ టీచర్ రాజ్‌కుమార్, మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, డిసిఇబి ప్రతినిధి రాజారావు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ జెట్టీ, విసిసి సభ్యులు స్వర్ణలత సంతోషం, అప్పారావు, స్వామి విద్యానికేతన్ పాఠశాల ప్రతినిధి పాలూరి దేవి పాల్గొన్నారు.

# పేరాడ తిలక్‌ను కలిసిన బొడ్డ గోవింద్

**ప్రజాశక్తి -గాజువాక :** శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌ఛార్జిగా నియమితులైన పేరాడ తిలక్‌ను 87వ వార్డు వైసిపి నాయకులు బొడ్డ గోవింద్ ఆదివారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకముగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి సంతోష్, నక్కళ్ల శంకరరావు, మార్పు శివప్రసాద్ పాల్గొన్నారు.

## 'ఉత్తరం'లో గ్రీవెన్స్

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆదివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** కంచరపాలెం కాపు, తెలగ, బలిజ, జన ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఇండస్ట్రియల్ ఎస్టేట్ 3 స్టార్స్ వాకర్స్ క్లబ్ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల వైసిపి సమన్వయకర్తలు కెకె రాజు, ఆడారి ఆనంద్ కుమార్, కార్పొరేటర్లు చల్లా రజిని, కెపి.రత్నాకర్, నూకరాజు, చిరంజీవి, షేక్‌బాబ్జి, సంఘం పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గంలోని కైలాసపురం ప్రాంతానికి చెందిన బొట్టా రాజు 500 మంది అనుచరులతో వైసిపిలో చేరారు. డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ సమక్షంలో వారికి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, ఎంవి.రమణ, కె.చిన్న, ఎన్.కృష్ణ, లావణ్య, ఎస్.రామారావు, కె.ఈశ్వరరావు, ఎన్.ఈశ్వరరావు, కె.శ్రీను, దేవి తదితరులు పాల్గొన్నారు.

## సొంత చెల్లికే అన్యాయం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** తనకు జరిగిన అన్యాయంపై వైఎస్.షర్మిల ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని చోడవరం జనసేన ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏలూరులో జరిగిన సిద్ధం సభలో పవన్‌కల్యాణ్‌పై జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సభల్లో మీ పార్టీ గురించి, మీరు చేసిన పనులు గురించి మాట్లాడుకోండి తప్ప పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భీమిలి సభలో సిలువ గుర్తుపై నడిచి విమర్శలు పాలైన ముఖ్యమంత్రికి హిందువులకు సంబంధించిన కృష్ణుడు, పురాణపురుషుల పేర్లను ఎత్తే నైతిక అర్హత లేదన్నారు. హిందూ దేవుళ్లను, పురాణాలను తన రాజకీయ ప్రసంగాల్లో తనకు తాను అన్వయించుకొని హిందువుల మనోభావాలను గాయపరుస్తున్నారన్నారు.

## అత్యుతాపురం మండల పరిశీలకులుగా సురేష్

**ప్రజాశక్తి -తగరపువలస :** యలమంచిలి నియోజక వర్గ పరిధి అత్యుతాపురం మండల టిడిపి పరిశీలకులుగా పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ నియమితులయ్యారు. ఇతను భీమిలి మునిసిపల్ కౌన్సిలర్‌గా గతంలో పనిచేశారు. అనకాపల్లి జిల్లాలో ఈ నెల 5 న "రా కదలి రా" సభ విజయవంతం నిమిత్తం పలు మండలాలకు పార్టీ పరిశీలకులను నియమించిన విషయం విదితమే. ఇందులో భాగంగా తనను అచ్యుతాపురం పరిశీలకునిగా పార్టీ నియమించినట్లు ఆయన తెలిపారు.

# ముస్తాబైన రా కదలిరా వేదిక

## నేడు గొండుపాలెంలో చంద్రబాబు బహిరంగసభ

సిద్ధంగా ఉన్న సభావేదిక

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెంలో సోమవారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'రా కదలిరా' బహిరంగసభకు సర్వంసిద్ధమైంది. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ పార్టీ ముఖ్యనేతలు పెద్ద ఎత్తున పాల్గొనే సభా ప్రాంగణాన్ని అన్ని హంగులతో సిద్ధం చేశారు. 13ఏళ్ల తర్వాత మాడుగుల నియోజవర్గానికి రానున్న చంద్రబాబు సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని దాదాపు రెండు లక్షల మంది వచ్చే అవకాశం ఉన్నందున, దాని తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుద్ద నాగజగదీశ్వరరావు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. రా కదలిరా బహిరంగ సభకు జనసమీకరణకు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నేతలతో సన్నాహక సమావేశాలను నిర్వహించి, సమాయత్తం చేశారు. చేజారిపోయిన టిడిపికి కంచుకోటలాంటి మాడుగుల నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలను టిడిపి జెండా ఎగరేయడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. చంద్రబాబు సభ ఏర్పాట్లును మాడుగుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నేత పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. మాడుగుల నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జి రాయపురెడ్డి కృష్ణతోపాటు ఆపార్టీ ముఖ్యనేతలు సైతం ఏర్పాట్లులో భాగస్వాము లయ్యారు.

### 'రా కదలిరా' స్టిక్కర్ల ఆవిష్కరణ

కశింకోట : మాడుగుల నియోజకవర్గం గొండుపాలెంలో సోమవారం నిర్వహించే రా కదలిరా బహిరంగ సభకు సంబంధించిన స్టిక్కర్లను ఆదివారం మండలంలోని తేగాడ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం, ప్రజల భవిష్యత్తు కోసమే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో కర్రోతి బంగారురాజు, తెలుగు రైతు రాష్ట్ర ఆధికార ప్రతినిధి గొంతిను శ్రీనివాసరావు, మురళీ, సిదిరెడ్డి శ్రీను మాజీ సర్పంచ్ సిదిరెడ్డి సూర్యనారాయణ, నైనముశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, బాబూరావు పాల్గొన్నారు.

స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

## 'ఓట్ ఫర్ ఒపిఎస్'ను జయప్రదం చేయండి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పాత పెన్షన్ పథకం సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు తలపెట్టిన ప్రత్యేక కార్యాచరణను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నేతలు కోరారు. ఆదివారం అనకాపల్లిలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ, పాత పెన్షన్ పథకం సాధనకు చేపట్టే ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 12 వరకు పోస్ట్‌కార్డ్ ఉద్యమం చేస్తామని, అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు ఉత్తరాలు రాస్తారన్నారు. ఈనెల 13 నుంచి 29 వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరనున్నట్లు తెలిపారు యూనియన్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ విపక్ష నేతగా వారంరోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీనిచ్చి, ఎవరూ కోరుకోని జిపిఎస్‌ను ప్రవేశపెట్టడం మోసపూరిత చర్య అన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే ఓటు వేయాలనే నినాదంతో ఈ ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు నడిగట్ల శేషుకుమార్, చైతన్య, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, సీనియర్ నాయకులు శివప్రసాద్, శివశ్రీ, కామరాజు, బాబూరావు, రామచంద్రరావు, మహేష్, పావని, ప్రసన్న పాల్గొన్నారు.

## ఘనంగా ఎంవిఆర్ జన్మదిన వేడుకలు

ఎంవిఆర్‌కు కేకు తినిపిస్తున్న సూర్యకుమారి

ప్రజాశక్తి -అనకాపల్లి : పారిశ్రామికవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు(ఎంవిఆర్) జన్మదిన వేడుకలు ఆదివారం అతని స్వగృహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆయన అభిమానులు నాయకులు హాజరై పూలదండలు బొకేలు, దుశ్శాలులతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అన్నసమారాధన, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవిఆర్ సతీమణి సూర్యకుమారి, తనయులు రాజేష్, సతీష్ ఇతర నాయకులు తరలివచ్చారు. ఎంవిఆర్ పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

## చంద్రబాబు సభను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గం .కోటపాడు మండలం గొండుపాలెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పాల్గొనే రా కదలిరా బహిరంగ సభను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి 2 లక్షల మంది ప్రజలు బహిరంగ సభకు హాజరవుతున్నారని తెలిపారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, సైకో జగన్‌రెడ్డి అరాచక పాలన నుంచి విముక్తి ఆంధ్రప్రదేశ్ సాధనకు చంద్రబాబు నాయుడు తలపెట్టిన రా కదలిరా సభలకు అన్ని ప్రాంతాల్లో విశేషమైన స్పందన వస్తోందన్నారు. 124 సార్లు సంక్షమ పథకాల బటన్ నొక్కానని, రెండోసారి తనకు గెలుపునకు బటన్ నొక్కాలని సిఎం జగన్ ప్రాధేయపడుతుండడం చూస్తుంటే, అతనికి ఓటమి భయం పట్టుకుందని స్పష్టమౌతోందన్నారు. ప్రజలే నా స్టార్ క్యాంపెయిన్ అని ఉత్తర కుమార్ ప్రగల్బాలు పలుకుతున్న జగన్ ఇంటికెళ్లడం ఖాయమన్నారు. జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపడానికి ఎప్పుడెప్పుడు ఎన్నికలొస్తాయా అని జనం ఎదురుచూస్తూ, సిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు పాల్గొన్నారు.

## వైసిపిలో చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రంలో వైసిపికి ఆదరణ మరింత పెరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం మండలంలోని అడ్డూరు గ్రామంలో 30 కుటుంబాల టిడిపి కార్యకర్తలు ధర్మ శ్రీ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మహిళలకు నేరుగా వారి ఖాతాల్లో పడేలా ఎక్కువశాతం సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని అబద్దాలు చెప్పినా, అధికారంలోకి రావడం కష్టమన్నారు. అనంతరం రాయపూర్ రాజుపేటలో గ్రామ సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించారు. స్థానిక ఎంపిపి గాడి కాసు, డిసిఎంఎస్ చైర్మన్ పల్లా నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, నాయకులు బొడ్డేటి సూర్యనారాయణ, సర్పంచ్ రామనాయుడు పాల్గొన్నారు.

## మొక్కల నాటివేత

మొక్కలు నాటుతున్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- కశింకోట: కశింకోట బాలిక ఉన్నత పాఠశాలలో ఆదివారం అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలలు దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ఆవరణలో 35 మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయి అవార్డు గ్రహీత పణిభూషణ్ శ్రీధర్, హెచ్‌ఎం స్వర్ణ కుమారి, మళ్లమురళీ పాల్గొన్నారు.

## సచివాలయ హెల్త్ సెక్రటరీపై సస్పెన్షన్ ఎత్తేయాలి

డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న హెల్త్ సెక్రటరీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : హెచ్‌బి పర్సంటేజీ రీడింగులో సాంకేతిక లోపాన్ని కారణంగా చూపి జిల్లాలోని యలమంచిలి రేగుపాలెం ఏటికొప్పాక-1 సచివాలయం హెల్త్ సెక్రటరీ జె. జ్యోతిని సస్పెండ్ చేయడాన్ని ఎపి యునైటెడ్ సచివాలయ హెల్త్ సెక్రటరీ అసోసియేషన్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నేతలు తీవ్రంగా ఖండించారు. శనివారం రాత్రి డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్‌కు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉన్న హెల్త్ సెక్రటరీలంతా తరలివచ్చి వినతి పత్రాన్ని అందించారు. ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుని పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు చేయాల్సిన పనిని ఎఎన్ఎంలతో చేయించడం సరికాదన్నారు. అనేక యాప్‌లు, ఎమర్జెన్సీ పేరుతో నిత్యం తీవ్ర పనిఒత్తిడికి హెల్త్ సెక్రటరీలను గురి చేయటం, పనిలో భాగంగా ఎక్కడైన చిన్న లోపం తలెత్తితే వారిపై చర్యలు తీసుకోవడం దుర్మార్గమని, ఇపుడు ఏకంగా జ్యోతిపై సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. దీన్ని మొదటి తప్పిదంగా భావించి షోకాజు నోటీసు, ఇతర పనిష్మెంట్లు ఇవ్వాలని కోరారు. వైద్యారోగ్య శాఖ, రాష్ట్ర కమిషనర్, అధికారులందరూ దీనిపై పునరాలోచన చేసి ఈ సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రత్నం, ఆళ్ల దేవకి, జగన్మోహిని, నాయకులు కె.వి. సత్యనారాయణ, రాష్ట్ర అడ్వైజర్ కె. జగన్మోహన్ రావు, జెవిసి నేతలు శ్రీనివాసాచారి, రాము.పి సాంబ మూర్తి పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు: గ్రామ పంచాయతీలు, సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల6న చలో అసెంబ్లీ ముట్టడి ఆందోళనను సర్పంచులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచుల అధికారాలు, హక్కులను కాలరాసిందన్నారు. పంచాయతీలకు చెందాల్సిన నిధులను కాజేసి, 3.50లక్షల మంది గ్రామీణ ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. ఈ ఆందోళనకు రాష్ట్రంలోని 12.918 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లందరూ రాజకీయాలు, పార్టీలకు అతీతంగా విధిగా హాజరు కావాలన్నారు. సోమవారంసాయంత్రం బయలుదేరి, మంగళవారం ఉదయానికి మంగళగిరి చేరుకునేలా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

## 'సాధన సంకల్ప సభ'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈనెల 10న పాయకరావుపేటలో అంబేద్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలని ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బంగారి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల అంబేద్కర్ కాలనీలో సాధన సంకల్ప సభ పోస్టరును సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు రేపాక మధుబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెయ్యి జనాభా కలిగిన ప్రతి దళితవాడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని, ఆయా పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయడం ద్వారా వాటిని బాగుచేసే చర్యలు చేపట్టాలన్నారు. దళితవాడల్లో గ్రంథాలయం ఏర్పాటు, జాతి అభివృద్ధికి, రాజ్యాధికార దిశగా ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి వడ్డాది భారతి, అంబేద్కర్ మిషన్ జోనల్ నాయకులు శ్రీనివాసరావు, ఐటీ వింగ్ జల్లి రాజశేఖర్, రెళ్ల నారాయణరావు, వడ్డాది అశోక్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

# అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

## 'బాబు ష్యూరిటీ' ప్రచారంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి- సబ్బవరం : రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మల్లు నాయుడుపాలెం గ్రామంలో గండి దేముడు అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన కూటమి ఘన విజయంతో, చంద్రబాబు ముఖ్య మంత్రి కావడం ఖాయమన్నారు. సబ్బవరం మండలంలో మారుమూల వంగలి గ్రామంలో జాతీయస్థాయి యూనివర్సిటీలు ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మల్లునాయుడు పాలెం గ్రామంలో వైసిపికి చెందిన సింగంపల్లి సత్యం రమణమ్మ ఆధ్వర్యంలో పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వీరికి బండారు తెలుగుదేశం కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గండి రవికుమార్, మిడతాడ మహ లక్ష్మి నాయుడు, నియోజకవర్గ పరిశీల కులు దత్తి లక్ష్మణరావు, బరినకాన బాబురావు, బుచ్చిరాజు, కొటన అప్పారావు, బొండా సత్యారావు, రొంగలి దేముడు, దెడ్డం ప్రసాదరావు, దాసరి వెంకటరమణ, బొబ్బరి కన్నారావు, ఎం అక్కబాబు తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు పెద్దాడ రమణమ్మ పాల్గొన్నారు.

**వడ్డాది :** సమర్థుడైన చంద్రబాబు సిఎంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ సాయం రాజశేఖర్(శేషు), ఎల్లపు జగ్గారావు అన్నారు. ఆదివారం బంగారుమెట్టలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్ళి, టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దొండ శ్రీను, కామకా రమణ పాల్గొన్నారు.

**నక్కపల్లి:**నక్కపల్లిలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు అడ్డూరి లోవరాజు ఆధ్వర్యంలో ఆదివారం కర్రి వీధిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం పై ప్రచారం చేపట్టారు. టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి - జనసేన ఉమ్మడి మేనిఫెస్టోపై ప్రజలకు వివరించారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15 వేలు, ఆడబిడ్డ నిధి పేరిట 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, దీపం పథకం ద్వారా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి రైతుకు సంవత్సరానికి 20 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిగట్ల రమణ, పెద్దిరెడ్డి రమేష్, కొప్పిశెట్టి వీరబాబు, కెవి సత్య నారాయణ, మీగడ సత్తిబాబు, మీసాల ఉమామహేశ్వర రావు, కక్కిరాల సురేష్, ఎన్ కాశీ, పచ్చిపులుసు నాగేశ్వరరావు, అల్లాడ తాతారావు పాల్గొన్నారు.

**ములగాడ :** జివిఎంసి 60, 61వ వార్డుల పరిధిలోని జనతా కాలనీలో బాబు ష్యూరిటీ- భవిషత్తు గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, చంద్రబాబు రాకతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అ'పూర్వ' కలయిక

55 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ మిత్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరపాలెం మున్సిపల్ హైస్కూల్ 1968 - 69 పదో తరగతి మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఉత్సాహంగా జరిగింది, దాదాపు 55ఏళ్ల తర్వాత అప్పట్లో పదో తరగతి చదివిన పాత స్నేహితులందరూ కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని, యోగక్షేమాలు తెలుసుకొని ఆనందంగా గడిపారు. హైదరాబాదు, విశాఖపట్నంతోపాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 36 మంది పూర్వమిత్రులంతా హాజరై, ఉల్లాసంగా గడిపారు.కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షులు, విశాఖ జిల్లా గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ, ఎంబివి స్వామి, కొడుకుల లక్ష్మీ మోహనరావు, బుద్ధ వీరునాయుడు, బిసిహెచ్ కన్నాజీరావు, కృష్ణ పరమాత్మ, కెఎం.నాయుడు తదితర మిత్రులు పాల్గొన్నారు. ఉదయం టిఫిన్ మధ్యాహ్నం సహపంక్తి విందు భోజనం, గ్రూప్ ఫోటోతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాత మిత్రులందరికీ బుద్ధ శివాజీ సొంత నిధులతో బహుమతులు అందజేశారు. ఇలాంటి ఆత్మీయ కలయిక ఏటా నిర్వహించాలని నిర్ణయించారు. తమతోపాటు చదువుకుని, మరణించిన కొందరు పాత మిత్రులకు సంతాప సూచకంగా మౌనం పాటించారు.

## చింతలపూడిలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

గిరిజనులతో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి గిరిజన పంచాయతీలో ఆదివారం డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మరోసారి పర్యటించారు. గత పర్యటన సమయంలో సమ్మెద నుండి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోడిగరువు, నేరెళ్ళపూడి వరకు కాలినడకన వెళ్లిన ఉపముఖ్యమంత్రి, ఆయా ప్రాంతాల ప్రజల కష్టాలను పర్యవేక్షించి అధ్యయనం చేసుకుని, రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించి, కొత్త రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కేవలం 23 రోజుల కాల వ్యవధిలోనే ఆ రోడ్డు పనులు పూర్తి చేయించి, ఇపుడు అదే మార్గం గుండా తన కారులో, వాహనశ్రేణితో 5 కిలోమీటర్ల ప్రయాణం చేస బోడిగరువు నేరెళ్ళపూడి గ్రామాలకు చేరుకొని గ్రామ ప్రజలను మరోసారి పలకరించారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించిన ఉపముఖ్యమంత్రికి గిరి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి సత్యం, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కర్రీ సూరినాయుడు, నాయకులు ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం లైబ్రేరియన్ ఒ.శ్రీనివాసరావు 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదివించారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. విద్యార్థులు నిరంతరం పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకొని చదువులో చక్కగా రాణించాలని ఆకాంక్షించారు.

# దేవరాపల్లి వైసిపిలో ముసలం!

### టిడిపిలో చేరునున్న 500 కుటుంబాలు
### బూడి నియంతృత్వ పోకడలకు నిరసన

మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల వైసిపిలో ముసలం పుట్టింది. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నియంత పోకడలకు విసిగి చెంది వివిధ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు వైసిపి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వేచలం గ్రామంలో వైసిపి నాయకులు, ఎంపిటిసి రెడ్డి శ్రీలక్ష్మి బలరాం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలు వైసిపిని వీడి సోమవారం టిడిపి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వేచలం ఎంపిటిసి రెడ్డి శ్రీలక్ష్మి బలరాం మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితుల్లో తాను ఉన్నప్పటికీ, తనకు సంబంధం లేని విషయంలో భారీగా పోలీసులను మొహరించి అన్యాయంగా తనపై తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. మంత్రి బూడి ముఖ్య అనుచరుడిగా తన రాజకీయ జీవితమంతా ఉన్నప్పటికీ, చెప్పుడు మాటలు విని తనను దూరం పెట్టారని,ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. అధికార పార్టీ ఎంపిటిసి అయినప్పటికీ ఎపుడూ ప్రోటోకాల్ పాటించలేదన్నారు. కలిగొట్ల సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొడ్డు జగదీశ్వరరావు, వాకపల్లి మాజీ ఎంపిటిసి పెనగంటి సింహాచలం నాయుడు మాట్లాడుతూ వైసిపిలో కష్టపడి పని చేసిన వారికి కనీసం గుర్తింపు లేకపోగా, తమకు సంబంధం లేని విషయాలలో మంత్రి బూడి కలుగజేసుకొని నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. పలువురిపై అన్యాయంగా కేసులు పెట్టి మానసికంగా వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగక పోవడంతో వైసిపి పాలనపై విరక్తి చెంది, టిడిపి అధినేత చంద్రబాబు సమక్షంలో స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. ఉప సర్పంచ్ దొగ్గ రమేష్ (వాకపల్లి), గొర్లె గోవింద (ఎం. అలమండ), గొర్రెపోటు సన్యాసినాయుడు (కలిగొట్ల), మాజీ ఎంపిటిసి చిరికి గోవింద (కొత్తపెంట) పాల్గొన్నారు.

## నీటి ట్యాంకుల పటిష్టతపై పరీక్షలు

### పెచ్చులూడి పడుతుండడంతో జనం భయం

సౌండ్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎయు నిపుణుడు రాకేష్‌కుమార్

ప్రజాశక్తి -సబ్బవరం: మండలం లోని బంగారమ్మ పాలెం, అంతకాపల్లి గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకులకు సౌండ్ నెస్ పరీక్షలు ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇఇ హిమ బిందు తెలిపారు. బంగారమ్మ పాలెం రామాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడడంతో సౌండ్ నెస్ పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బంగారమ్మ పాలెం సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, సెక్రటరీ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ రూప, దొడ్డి వీర అప్పారావు, దొడ్డి సూరి అప్పారావు పాల్గొన్నారు.

# శ్మశానవాటిక స్థలానికి రక్షణ కల్పిస్తా :ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు సమస్య విన్నవిస్తున్న గొల్లగుంట గ్రామస్తులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామంలోని ముస్లిం శ్మశానవాటిక దురాక్రమణకు గురికాకుండా రక్షణ చర్యలు చేపడతానని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హామీనిచ్చారు. ఆదివారం రావాడ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామంలోని ముస్లిం శ్మశానవాటిక కబ్జాపై స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు కోన రామారావు, వార్డు సభ్యులు షేక్ ఆలీ ఆధ్వర్యంలో స్థానికులు వివరించి, శ్మశానస్థలం రక్షణకు ప్రహరీ నిర్మించాలని వేడుకున్నారు. శ్మశానవాటిక ఉన్న స్థలం అచ్చుతాపురం మండలం నడింపల్లి రెవిన్యూలో పరిధిలోకి వస్తుందని గ్రామస్తులు చెప్పగా, దీనికి సంబంధించి ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజుతో ముందు మాట్లాడుతానన్నారు. శ్మశాన వాటిక స్థలం సర్వే జరిపించి, సరిహద్దులు నిర్ధారించి, దాని చుట్టూ పెన్సింగ్ వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

**పరవాడ:** మండలంలో పలు గ్రామాలలో రూ.43.60లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. రూ.43.60 లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన సచివాలయాన్ని, తానాం, నాయుడుపాలెంలలో ఒక్కొక్కటీ రూ.23.94 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను, పరవాడ, కలపాకల్లో ఒక్కొక్కటీ రూ. 35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను, వెన్నలపాలెంలో రూ.8 లక్షల పంచాయతీ సాధారణ నిధులతో నిర్మించిన ఎన్‌టిపిసి సింహాద్రి కల్యాణమండపం ప్రహరీని, రూ.18లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన వంటగదిని, వెన్నలపాలెం, నాయుడు పాలెంలలో ఒక్కొక్కటీ రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించారు. రావాడలో ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు రూ.16.25 లక్షలతో కొనప్ప ట్యాంక్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. రావాడ పంచాయతీ గొల్లగుంటలో రూ.10లక్షల జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటి కుళాయి పథకాన్ని ప్రారంభించారు. గొల్లగుంట గ్రామంలో రూ.12లక్షల ఎన్‌టిపిసి నిధులతో నిర్మించిన నూతన తరగతి గదిని ప్రారంభించారు. రావాడ ఎన్టీఆర్ కోలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని, మోటూరువానిపాలెంలో రూ.14లక్షల జలజీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటి కుళాయిలు, 15వ ఆర్థిక సంఘం పంచాయితీ నిధులు రూ.11.50 లక్షలతో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి పైల వెంకటపద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పిఎస్ రాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు బోస్ అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షుడు కోన రామారావు పాల్గొన్నారు.

### ఎస్‌సి బాలుర వసతి గృహంలో

# విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

రోధిస్తున్న బంధువులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని జోగుంపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో చదువుతున్న బుడ్డడపాడుకు చెందిన ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి తూబిరి డేవీడ్ రాజు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం మెడపై బట్టలు ఆరేసుకోవడానికి హాస్టల్ మేడ మీదకు వెళ్లాడు. బట్టలు ఆరేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై ఆపస్మారక స్థితికి చేరడంతో విద్యార్థిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఈ సమాచారం తెలసుకున్న ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గీతాకృష్ణ తదితరులు అసుపత్రికి వెళ్లి మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థి మరణంపై సమగ్ర విచారణ జరిపి, వార్డిన్‌ని సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థి కుటుంబానికి 10లక్షలు హరిహారం చెల్లించాలన్నారు.

**సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం**

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తిలు డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి మృతి చెందారన్నారు. తక్షణమే విద్యార్థి కుటుంబానికి 10లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

**నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి: కేవిపిఎస్**

హాస్టల్ విద్యార్థి మృతికి కేవలం నిర్లక్ష్యమే కారణమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆవేదం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తక్షణమే సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**పరిహారం చెల్లించాలి : ఎస్ఎఫ్ఐ**

**నర్సీపట్నం టౌన్** గొలుగొండ ఎస్సీ హాస్టల్లో విద్యార్థి మరణం పై సమగ్ర విచారణ జరిపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గీతాకృష్ణ డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి 10 లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండటంతో తమను కలచివేసిందని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర విచారణ జరిపి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఇంత జరిగినా సోషల్ వెల్ఫేర్ అధికారులు ఇప్పటివరకూ పటించుకోకపోవడం దారుణమన్నారు. ఆసుపత్రిలో కుటుంబీకులను పరామర్శించిన వారిలో జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రసాద్ , డివిజన్ సభ్యులు తేజ , కోటి , కుశ తదితరులు ఉన్నారు.

పందిరిలాట వేస్తున్న గ్రామ పెద్దలు

## ఘనంగా దుర్గమ్మ పందిరి రాట

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఆలయ ధర్మకర్త కొప్పిసెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో పందిరి రాటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 11న దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 10వ తేదీన ఏకాహం ( భజన ), 11న ప్రత్యేక పూజలు, అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మహేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిసెట్టి కొండబాబు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, గురు భవాని, దవరసింగి రాంబాబు, గ్రామస్తులు సిద్దాబత్తుల కృష్ణ, కొప్పిసెట్టి లచ్చబాబు, కొప్పిసెట్టి జగదీశ్వరరావు, కొంకిపూడి దొరబాబు, వరహాలరావు పాన్నారు.

# అపారిశుధ్యానికి కేరాఫ్ ఇందిరా మార్కెట్

అపారిశుధ్యంగా ఉన్న ఇందిరా మార్కెట్

ఇందిరా మార్కెట్ వద్ద సంచరిస్తున్న పందులు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**మున్సిపాలిటీ నడిబొడ్డన ఉన్న ఇందిరా మార్కెట్ డంపింగ్ యార్డును తలపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్కెట్‌కు రావాలంటే ప్రజలు హడలి పోతున్నారు. కరోనా సమయంలో ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మార్కెట్‌ను చింతపల్లి రోడ్డులోని జూనియర్ కాలేజ్ సమీపంలో ఏర్పాటు చేశారు. అప్పటినుంచి కూడా ఇప్పటివరకు అక్కడే కొనసాగుతుంది. కరోనా అనంతరం ఇక్కడ మళ్లీ మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఈ మార్కెట్లో మాంసం, కోళ్ల మాంసం, చేపల దుకాణాలు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడి చెత్తపై వాలిన దోమలు, ఈగలు, క్రిమి కీటకాదులు ఈ మాంసాలపై వాలడంతో ఈ మార్కెట్ వైపు ప్రజలు చూడటమే మానేస్తున్నారు. మాంసాలపై ఈగలు, దోమలు వాలినవి భుజిస్తే వ్యాధులు రావా అని పలువురు ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నీతి కథలు చెబుతున్న గ్రంథాలయాధికారి దయమంతి

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారిణి పి.దమయంతి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చేత నీతి కథలు చదివించి అందులో నీతిని బోధించారు. ప్రముఖ క్రీడాకారులు, నటీమణులు క్యాన్సర్ మహమ్మారిని ఏ విధంగా అధిగమించారో వివరించారు. పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో ఏ విధంగా ధైర్యంగా ఉండాలనే అంశంపై విపులంగా వివరించారు.

## 7 నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

**ప్రజాశక్తి-రోలుగుంట:**ఈ నెల 7, 8, 9 తేదీల్లో మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. 7న ప్రారంబించి, 8న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, 9న స్టేజీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.పండుగ మహోత్సవం అనంతరం నాల్గో రోజు గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 7న కొండపాలెం గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ బంటు చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీ రాత్రి డ్యాన్స్‌బేబి డ్యాన్స్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

## ఆర్‌బికె ఉద్యోగుల సంతాపం

**ప్రజాశక్తి-పాడేరు:**బాపట్ల జిల్లా చావలి ఆర్‌బికే ఇంచార్జి, వ్యవసాయ సహాయకురాలు బెల్లంకొండా పూజిత వ్యవసాయ అధికారుల తీవ్రమైన ఒత్తిడితో బలవన్మరణం చేసుకోవడం బాధాకరమని అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరు ఆర్‌బికే ఉద్యోగులు తెలిపారు. మేరకు మండల కేంద్రంలోని ఆర్‌బికె వద్ద సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఉద్యానవన సహాయకులు జిల్లా అధ్యక్షులు శెట్టి. రాజు, జనరల్ సెక్రటరీ కూడా గణపతిరాజు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

నక్కపల్లి మండలం రేవుపోలవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఆదివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా రేవు పోలవరం గ్రామానికి చెందిన యజ్జల బంగారు చిట్టి తన తల్లి ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ,జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైజాగ్ మెడికవర్ ఆస్పటల్ వైద్య బృందం గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. పాయకరావుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు అధ్యక్షులు వెలాగ సుధాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పిక్కి సత్తియ్య, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, వాసపల్లి నూకరాజు, పిక్కి చిన్నారి ,కిరణ్, గోపి, గుర్రన్న, బాబ్జి, తాతీలు, కోటి అప్పలరాజు, కొండలరావు, శ్రీను, మహేష్ బాబు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:**మండలంలోని పెద్ద గుమ్ములూరు గ్రామంలో బి.బి.ఆర్ ప్రజా వైద్యశాల వద్ద ప్రముఖ వైద్యులు బంగారయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉచితంగా వైద్యం అందించమే కాకుండా మందులు కూడా అందజేశారు. గడిచిన పది సంవత్సరాలకు పైగా పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ తమను ఆదుకుం టున్నారని రోగులు తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు బంగారయ్య

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

## చేరికల పట్ల బూడి హర్షం

**మాడుగుల:** మండలంలోని ఓమ్మలి గ్రామ జనసేన పార్టీకి చెందిన మూడు కుటుంబాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో ఆదివారం వైసీపీ పార్టీలో చేరారు. వైసిపి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని మెచ్చి పార్టీలో చేరుతున్నట్లు నూతనంగా చేరిన వారు తెలిపారు. జనసేన గ్రామ కార్యదర్శిగా గతంలో పనిచేసిన తాటికొండ నాగభూషణం, వెలమశెట్టి కృష్ణ, గొర్లి సన్నీబాబులకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీలోకి నూతనంగా వచ్చినవారి రాక పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. వీరందరూ ఎంపిటిసి బొద్దపు భాస్కరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరగా వారి వెంట గ్రామ వైసీపీ యూత్ కార్యదర్శి పర్రే ఏసుబాబు, కన్వీనర్ పోతల వెంకట రాజు ఉన్నారు.

హాజరైన అధికారులు, నాయకులు

## ఉపాధి పనుల తనిఖీలపై గ్రామసభ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం బికె పల్లి, రామచంద్ర పాలెం గ్రామాలలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పనులపై నిర్వహించిన ఖర్చు వివరాలు స్థానిక నాయకులు అడిగి తెలుసుకోవడంతో పాటు అధికారుల తీరు పట్ల చెల్లించాల్సిన బిల్లుల పట్ల అధికారులను నిలదీశారు. కొంత మంది లబ్ధిదారులకు, కూలీలకు వేతనాలు అందలేదని, ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించ లేదని తనిఖీ బృందం దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు ఏమైనా ఉంటే ఈనెల 6న జరగనున్న ప్రజా వేదికలో తీసుకు రావాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బికెపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, ఏపీవో గంగు నాయుడు, ఎన్ఆర్పి రామారావు, పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

## న్యాయవాదుల గుమస్తాల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం న్యాయవాదుల గుమస్తాల అసోసియేషన్ సమావేశం ఆదివారం పాత కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వి.హనుమంతరావు, ప్రెసిడెంట్గా టి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్గా బి.బాపిరాజు, సెక్రటరీగా డి.రమణ, జాయింట్ సెక్రటరీగా ఆర్.తిరుపతయ్య, కోశాధికారిగా జి.తాతాలు, ఆర్గనైజేషన్ కె.నూకరాజు, సాయి, రాజబాబు, గణేష్, దారబాబు, లక్ష్మణరావు, కన్నయ్య, నాయుడు, అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

## రూ. 5 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చంపేటకు చెందిన ములంపాక నాగరాజు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ పరామ ర్శించారు. అనంతరం 5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నగదు ఇస్తున్న వార్డు కార్యదర్శి

## రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వడ్డాది : జగన్ పాలనలో అన్ని మౌలిక వసతులతో గ్రామాలను అభివృద్ధి చెందు తున్నాయని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం విజయరామరాజుపేటలో నూతన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో సచివాలయం, ఆర్బికే, హెల్త్ కేంద్రాలు, స్కూల్ భవనాలు నిర్మాణం జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దొండా రాంబాబు, సర్పంచ్ ఎల్లపు విజయ్ కుమార్, ఎంపీటీసీ బాలకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షుడు గోవిందు, వైసీపీ నేత వేగి మహాలక్ష్మి నాయుడు, ఉపసర్పంచ్ దొడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

# విద్యార్థులతో స్టేడియం కిటకిట

## - ఉచిత ప్రవేశంతో 7 వేల మంది రాక

ప్రేక్షకులతో కిక్కిరిసిన స్టేడియం

వికెట్ తీసిన ఆనందంలో ఇంగ్లండ్ క్రికెటర్లు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : డాక్టర్ వైఎస్ఆర్ ఏసిఏ-విడిసిఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌ను చూసేందుకు ఆదివారం విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మ్యాచ్ జరుగుతున్న ఐదు రోజులూ రోజు రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాలని ఏసిఏ కార్యవర్గం ముందుగా ప్రకటించింది. అయితే ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రకటించిన వాటికంటే మూడింతలకు పైగా అంటే దాదాపు ఏడు వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు ఎవ్వరూ నిరాశతో వెనుదిరిగి వెళ్లకుండా పోలీసుల సహకారంతో ఏసిఏ సిబ్బంది దగ్గరుండి వారికి బి, కె, ఇ స్టాండ్లలో అందరికీ ఉచిత ప్రవేశం కల్పించారు. మ్యాచ్‌ను ఉచితంగా తిలకించే అవకాశం కల్పించినందుకు పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

స్టేడియంలోకి వస్తున్న విద్యార్థులు

**వైజాగ్‌లో మంచి ఆదరణ :**

**బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ**

టెస్టు మ్యాచ్ కోసం వైజాగ్‌లో వచ్చినంత మంది ప్రేక్షకులను దేశంలో ఎక్కడా చూడలేదని బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ అన్నారు. రెండో టెస్టు మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆదివారం ఆయన స్టేడియాన్ని సందర్శించారు. స్టేడియంలో బిసిసిఐ జెండాను రోజర్ బిన్నీ, ఏసిఏ జెండాను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్. గోపినాథ్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రోజర్ బిన్నీ మాట్లాడుతూ, వైజాగ్‌లో మ్యాచ్‌ను చూసేందుకు హాజరైన ప్రేక్షకులను చూసి వన్డే, టీ-20 మ్యాచ్‌లను తలపించే విధంగా ఉందని పేర్కొన్నారు. మ్యాచ్ నిర్వహణ కోసం ఏసిఏ చేసిన ఏర్పాట్లు, పలు కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వి.చాముండేశ్వరినాథ్, ఏసిఏ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ జితేంద్రనాథ్‌శర్మ, ఏసిఏ సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీక్షిస్తున్న రోజర్ బిన్నీ

# ఉత్సాహంగా కేన్సర్ వాక్

విశాఖలో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని కాళీ మాతా గుడి నుంచి వైఎంసిఎ వరకు 'క్లోజ్ ది కేర్ గ్యాప్' అనే థీమ్‌తో కేన్సర్ అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ వెన్న మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గడిచిన ఏడాది కాలంలో కోటి మంది ప్రజలు కేన్సర్ బారిన పడి మృతిచెందారన్నారు. 2030కి ఆ సంఖ్య మరింత పెరగనుందని తెలిపారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించడం సులభమన్నారు. వాక్‌లో సిఐఐ, గీతం డెంటల్ కాలేజీ, యంగ్ ఇండియన్, ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐ డబ్ల్యుఎన్), ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఎపిఎన్ఎ, ఎన్ఎస్‌హెచ్ఎ, గాయత్రీ విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్, అనిల్ నీరుకొండ మెడికల్ కాలేజ్, రోటరీ క్లబ్ విశాఖ, వైజాగ్ ట్రైల్ రన్నర్స్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, ఏజ్ కేర్ ఫౌండేషన్, శ్రేయ కేన్సర్ ఫౌండేషన్ల నుండి సుమారు రెండు వేల మంది సభ్యులు పాల్గొన్నారు.

**కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు**

**ఆనందపురం :** ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా కారుణ్య కేన్సర్ ఫౌండేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన వేములవలస కూడలిలో కేన్సర్‌పై ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నవ్య మాట్లాడుతూ, కేన్సర్‌పై అవగాహన లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముందు జాగ్రత్తలు పాటిస్తే కేన్సర్‌ను అడ్డుకోవచ్చని తెలిపారు. దురాలవాట్లకు దూరంగా ఉంటూ మంచి పౌష్టిక ఆహారం తీసుకుంటే ఈ వ్యాధి భారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఆర్ఎంపి జోనల్ అధ్యక్షుడు, కారుణ్య కేన్సర్ ఫౌండేషన్ చైర్మన్ జంగం జోషి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి కోన ప్రకాష్, టీం సభ్యులు సత్య, రాధిక, మేఘన, డాక్టర్ హేమలత, సంతోషి, నవ్య హాస్పటల్ అధినేత జానకిరామ్, జయరావు, గ్రామీణ వైద్యులు పి.సుధాకర్ రెడ్డి, కెఎన్.రావు, పి.కనకారావు, వినోద్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:**మండలంలో సర్వసిద్ధి పి.హెచ్.సి, సైతారపేట, ఎస్.రాయవరం గ్రామాల్లో కేన్సర్ వ్యాధిపై అవగాహన శిబిరాలు, ర్యాలీలు నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ ఎస్.వాసంతి తెలిపారు. పి.హెచ్.సి వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీలో వాసంతి మాట్లాడుతూ, సరిగా వుడకని మాంసాహారాలు భుజించడంతో కేన్సర్ బారినపడుతున్నారన్నారు. వాయు కాలుష్యం , పని ఒత్తిడి, ఫాస్ట్ ఫుడ్స్, బేకరీ, ఆయిల్ ఫుడ్స్ తినడంతో కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కొన్ని రకాల క్యాన్సర్‌లు వంశపారం పర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకుని, మానసిక ఒత్తిడికి లోను కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి టి నాగేశ్వరరావు, హెల్త్ విజిటర్ ఎస్.సూర్య కుమారి, స్థానిక హెల్త్ సెక్రెటరీ ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది